రామనారాయణంలో నేడు యోగాంధ్ర

1500 మందితో యోగాసనాల ప్రదర్శన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రముఖ పర్యాటక కేంద్రంగా విలసిల్లుతున్న రామనారాయణం ఆధ్యాత్మిక కేంద్రంలో యోగాంధ్ర కార్యక్రమం శుక్రవారం ఉదయం నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయిలో పర్యాటక ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించి దీనిలో భాగంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లాలోని నాలుగు పర్యాటక ప్రాంతాలు ఎంపిక చేసింది. దీనిలో భాగంగా రామ నారాయణంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సుమారు 1500 మందితో ఇక్కడ యోగాసనాలు ఆరోజు ఉదయం 6-30 నుంచి 8 గంటల వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

త్రిశంకు స్వర్గంలో..

- స్టాఫ్ నర్సులుగా శిక్షణ పూర్తి చేసినా ఎఎన్ఎంలుగానే
- పిహెచ్‌సిల్లో ఖాళీలు లేక అవస్థలు

80 మంది ఎఎన్ఎంలు

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం

ప్రజాశక్తి -కంటోన్మెంట్

జిల్లాలో చాలా ప్రభుత్వ శాఖలు సిబ్బంది కొరతతో సతమత మవు తున్నాయి. కానీ జిల్లా వైద్య శాఖలో మాత్రం సుమారు 80 మంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అదనపు సిబ్బంది ఉన్నారు. గత ప్రభుత్వం పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న వన్ టైం స్టాఫ్‌నర్స్ శిక్షణకు అర్హత ఉన్న ఎఎన్ఎంలను ఎంపిక చేసింది. ఇలా ఒక్కొక్క పిహెచ్‌సి నుంచి ఎంపిక చేసి వారికి మూడేళ్ల పాటు స్టాఫ్ నర్స్ శిక్షణ ఇచ్చింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ను.జిల్లా కేంద్ర ఆసుపత్రిలోనూ వీరి సేవలు వినియోగించు కోవాలని ప్రభుత్వం భావించింది. 2024 సెప్టెంబర్‌లో వీరి శిక్షణ పూర్తయ్యింది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరిని ఎలా ఉపయోగించుకోవాలోనని తర్జన భర్జన పడింది.

అయితే వీరందరినీ గతంలో పని చేసిన స్థానాలకే పంపిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో వారంతా ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రిపోర్ట్ అయ్యారు. అయితే వీరి స్థానాల్లో అప్పటికే హెల్త్ సెక్రటరీలు, సెకెండ్ ఎఎన్ఎంలను ప్రభుత్వం సర్దుబాటు చేయడంతో వీరి పాత స్థానాలు ఖాళీలు లేవు. దీంతో వారంతా ఎక్కడ పని చేయాలో తెలీక ఆయా పిహెచ్‌సి కేంద్రాలకు రోజూ వెళ్లి హాజరు వేసుకొని వెళ్లి పోతున్నారు. కొంత మంది వైద్యాధికారులు పిహెచ్‌సి సేవలకు వినియోగించు కుంటుండగా.. మరికొంత మందిని గాలికొదిలేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వీరిని జిల్లా ఆసుపత్రుల్లో నియమించి వారి సేవలు వినియోగించు కోవాలని పలువురు కోరుతున్నారు..

కమిషనరేట్ నుంచి ఆదేశాలు రావాలి

గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే అర్హత గల ఎఎన్ఎంలను స్టాఫ్ నర్సులుగా ప్రభుత్వం శిక్షణ ఇచ్చింది. కమిషనరేట్ నుంచి ఆదేశాలు రాగానే వారందరినీ నియమిస్తాం

- ఎస్.జీవనరాణి, డిఎంహెచ్ఒ

కొఠియా సమస్య పరిష్కారానికి

చొరవ చూపాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరిన ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్న కొఠియా గ్రామాల వివాదాన్ని పరిష్కరించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు కోరారు. ఇటు ఆంధ్రప్రదేశ్ లో ఎన్ డి ఎ కూటమి అధికారంలో వుండడం, అటు ఒడిశా బిజెపి పాలిత రాష్ట్రంగా వున్న నేపథ్యంలో కొఠియా గ్రామ సమస్య పరిష్కరానికి ఇదే తగిన సమయమని పేర్కొన్నారు.గతంలో సుప్రీం కోర్టు కూడా ఈ సమస్యకు రాజకీయ, పరిపాలనా పరమైన పరిష్కారాలు చూడాల్సిన అవసరం ఉందని చెప్పిందని, ఆయా గ్రామాల ప్రజాభిప్రాయానికి విలువనిస్తూ, వారి సంక్షేమం, అభివృద్ధికి ఆటంకం కలగకుండా సమస్య పరిష్కరించాల్సి ఉందని తెలిపారు. ఈ మేరకు కేంద్ర గిరిజన శాఖకు, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. కొఠియా సమస్య పరిష్కారానికి కేంద్రం సారథ్యంలో కమిటీ వేయాలని, ఆంధ్ర, ఒడిశా ప్రభుత్వాలు కొఠియా గ్రామాల సమస్య పరిష్కారానికి తమవంతు సహకారం అందించాలని కోరారు.

కిటకిటలాడుతున్న రోగులు

సర్వజన ఆస్పత్రికి రోగుల తాకిడి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

జిల్లా సర్వజన ఆసుపత్రికి రోగుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాలోని పేదలు అనారోగ్యం సమస్యలు వస్తే జిల్లా సర్వజన ఆస్పత్రే పెద్ద దిక్కుగా మారింది. గతంలో కంటే వైద్యులు , వైద్య సేవలు పెరగడంతో ఆసుపత్రికి రోగుల తాకిడి కూడా పెరిగింది. అత్యవసర వైద్య సేవలు, జనరల్ మెడిసిన్, మానసిక వైద్య సేవలు, ఎముకలు , జనరల్ సర్జన్, డెంటల్, ఇఎన్‌టి, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులతో పాటు అదనంగా న్యూరో మెడికల్, న్యూరో సర్జన్,నెఫ్రాలజీ, గుండెకు సంబంధించిన వ్యాధులు వస్తే వైద్య సేవలు అందుతున్నాయి.గతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓ.పి.ఉండేది.మెడికల్ కాలేజీగా మారిన తర్వాత ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు వైద్యులు ఒపి చూస్తున్నారు.రోజుకు సుమారు ఆరు వందల వరకు ఆసుపత్రికి రోగులు వస్తున్నారు.దింతో ఆసుపత్రి ప్రాంగణం అంతా రోగులతో కిటకిట లాడుతోంది.ఓ.పి చీటీలు అందించే విభాగం వద్ద రోగులు పెద్ద సంఖ్యలో క్యూ లైన్ లో దర్శన మిస్తున్నారు

ఒపి విభాగంలో కిక్కిరిసిన రోగులు

వికలాంగ ధ్రువపత్రాలతో రీ వెరిఫికేషన్ మరింత తాకిడి

రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల ధ్రువీకరణ పత్రాల రీ వెరిఫికేషన్ చేయడంతో నాలుగు విభాగాల్లో ఓ.పి.పెరుగుతొంది.ఎముకల మానసిక, కంటి, ఈ. ఎం.టి. విభాగాలకు ప్రత్యేక కౌంటర్లు వేసి వికలాంగ సర్టిఫికెట్ రీ వేరిఫికేషన్ చేస్తున్నారు.దింతో ఆసుపత్రి ఓ.పి.కూడా పెరుగుతోంది.దింతో ఆసుపత్రి ఓ.పి.విభాగంలో రోగులు పెద్ద క్యూ లైన్లలో దర్శనమిస్తున్నారు.

గజపతినగరంలో

ఫీవర్ సర్వే

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మండల వ్యాప్తంగా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు మరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూజ్ రై తెలిపారు. తనను కలిసిన ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ... మండల వ్యాప్తంగా ఉన్న ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి రెండు టీములుగా వారంలో మూడు రోజులు వారి పరిధిలో ఉండే గ్రామాల్లో డోర్ టు డోర్ సర్వే చేస్తున్నారని తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ఇంటి పరిశుభ్రతను పాటించాలని, పరిసరాల పరిశుభ్రత వ్యాధులు వ్యాప్తిని నివారిస్తాయని, నీటి కుండీలు, మరుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలని కోరారు. డెంగ్యూ, మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులు నివారణకు వాటి లక్షణాలు ఉన్న వారిని సర్వే ద్వారా గుర్తిస్తామని తెలిపారు. అదేవిధంగా కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మాస్కులు, శానిటైజర్లు వినియోగించాలని కోరారు. ఇప్పటివరకు తమ పిహెచ్‌సి పరిధిలో 233 పైగా బ్లడ్ టెస్టులు, 84 రాపిడ్ టెస్ట్ లు నిర్వహించామని, అన్నీ నెగిటివ్ వచ్చినట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

బాల కార్మిక వ్యవస్థ నిరోధానికి

టాస్క్‌ఫోర్స్ కమిటీలు

కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో బాల కార్మికులు పని చేయకుండా చూడాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. జూన్ 2 నుండి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బాల కార్మికుల పునరావాసం కోసం ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం జిల్లాస్థాయి , డివిజనల్ స్థాయి లో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ సభ్యులు జిల్లా అంతటా ఒకే సమయంలో దాడులు చేయాలని తెలిపారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్ లో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగా ప్రమాదకరమైన సంస్థలు, స్థలాల్లో పని చేస్తున్న బాల కార్మికులను రెండు రోజుల్లోగా గుర్తించాలన్నారు. ఎక్కడైనా బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే పని చేయించే యజమాని పై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ మురళి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రసాదరావు, ఐసిడిఎస్ పీడీ రుక్సానా బేగం, డిస్ట్రిక్ట్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ హిమ బిందు, డిసిపిఒ లక్ష్మీ, డిఎస్‌పి , ఎన్.సి.ఎల్.పి, బెజ్జిపురం యూత్ క్లబ్, నేచర్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కడపలో జరుగుతున్న టిడిపి మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడును విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కలిశారు.

69 డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రూ.6.90 లక్షల జరిమానా

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లా ఎస్‌పి వకుల్‌జిందల్ ఆదేశాలతో విజయనగరం ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, మద్యం సేవించి, వాహనాలు నడిపిన వారిపై 69 కేసులు నమోదు చేశారు. వాహనదారులను విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చగా, ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 69 మందికి రూ.6.90 లక్షలను జరిమానా విధించారు.

యుద్ధ స్మారక స్థూపం నేడు ప్రారంభం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరంలోని నెహ్రూ యువ కేంద్రం వద్దగల సైనిక సంక్షేమ కార్యాలయం వద్ద యుద్ధ స్మారక స్థూపాన్ని ఈనెల 30న ఉదయం 10గంటలకు ప్రారంభం చేయనున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎం.కృష్ణా రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

మతం పేరిట మోసం

సదస్సులో వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-బొబ్బిలి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతం, జాతీయ వాదం పేరుతో ప్రజలను పక్కతోవ పట్టిస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందని వామపక్ష నాయకులు అన్నారు. 'ఉగ్రవాదాన్ని ప్రతిఘటిద్దాం-మత సామరస్యాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో సిపిఎం ఆధ్వర్యాన గురువారం భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో సదస్సు జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకర్రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎం. గోపాలం, పి.కె.ఎస్. నాయకులు టి. అప్పలనాయుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అప్పన్న మాట్లాడారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అత్యంత దుర్మార్గమని అన్నారు. కులం, మతం, జాతి భేదం లేకుండా మన సమాజంలో అన్ని తరగతుల ప్రజలు ఈ ఘాతుకంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉగ్రవాదుల్ని పట్టుకుంటామని ప్రగల్బాలు పలికి ఇంతవరకు ఆ నలుగురినీ పట్టుకోలేకపోయారని అన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేస్తానని ఉగ్రవాద ప్రేరేపిత పాకిస్తాన్ పై ఆపరేషన్ సింధూర్ ప్రారంభించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధం ఆపమని చెప్పగానే మోడీ ఆపేయడం మన దేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని తాకట్టు పెట్టడమేనని అన్నారు. ఈ ఉగ్ర దాడిని అడ్డం పెట్టుకొని దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి బిజెపి ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నం చేసిందని అన్నారు. ఈ ఉగ్రదాడిని బీహారు ఎన్నికల్లో ఓట్లుగా మలుచుకోవడానికి ఎన్నికల ప్రచారానికి వెళ్లారంటే ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ గోపాల్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు లక్ష్మణరావు పాల్గొన్నారు.

బొబ్బిలిలో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ

పూసపాటిరేగ : ఉగ్రవాదం మతోన్మాదం రెండూ దేశానికి ముప్పేనని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో గురువారం పూసపాటిరేగ శ్రీనివాస కళాశాలలో సిపిఎం నాయకులు బచ్చల సూర్యనారాయణ అధ్యక్షతన సమైక్యత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 370 ఆర్టికల్ రద్దు చేసినప్పటికీ కాశ్మీర్ సమస్యలను పరిష్కరించలేక పోయిందన్నారు. ఉగ్రవాద దాడులను అరికట్టేందుకు మన సైన్యం విరోచితంగా పోరాడిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలూ సంస్థలు వారికి బాసటగా నిలిచాయన్నారు. భారతదేశం మతఘర్షణలను పెంచడమే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడి చేస్తే దాని సాకుగా తీసుకొని బిజెపి ఆర్ఎస్ఎస్ లాంటివి హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశ ఐక్యతకు విచ్ఛిన్నం చేయడం దుర్మార్గమన్నారు. మతోన్మాదానికి తప్ప ప్రజల ప్రాణాలకు సైనికుల పోరాటానికి బిజెపి విలువ ఇవ్వడం లేదన్నారు. అమెరికా చెప్పినట్లు వింటూ మన దేశ అధికారాన్ని స్వతంత్రాన్ని తాకట్టు పెట్టేస్తున్నారని విమర్శించారు. బిజెపి సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి వాటిపై గట్టి పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేవంలో అంగన్వాడీలు, ఆశలు, కార్మికులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల సర్వే పూర్తి చేయాలి

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిర్దేశిత కాల పరిమితి లోగా వీధివిక్రయదారుల సర్వేను పూర్తి చేయాలని కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. గురువారం సాయంత్రం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వీధి విక్రయిదారులను గుర్తించి వారి వివరాలను నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈనెల 31వ తేదీ కల్లా నివేదికలు సమర్పించాల్సి ఉందని కావున త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన వీధివిక్రయదారులను మాత్రమే గుర్తించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ పర్యటన

నగరంలోని వివిధ ప్రాంతాలలో కమిషనర్ పల్లి నల్లనయ్య పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కొన్నిచోట్ల కాలువలలో పూడిక చేరిపోవడాన్ని గమనించి వెంటనే జెసిబి, బాబ్ కార్ట్ ల సహాయంతో పూడికలను తొలిగించాలని సూచించారు. అనంతరం అన్న క్యాంటీన్ల చేరుకుని ప్రజాభిప్రాయాలను సేకరించారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక ఇవిఎం గోదాములను కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురువారం తనిఖీ చేశారు. గోదాములకు వేసిన సీళ్లను, తాళాలను పరిశీలించారు. సెక్యూరిటీపై సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇన్‌ఛార్జ్ ఆర్‌డిఒ టి.సవరమ్మ, ఇన్‌ఛార్జి తాహశీల్దార్ రవిశంకర్, కలెక్టరేట్ ఇన్‌ఛార్జి సూపరింటిండెంట్ శేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గోదాం సీళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

అగ్నిప్రమాద బాధితులకు వితరణ

కంటోన్మెంట్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అగ్నిప్రమాద బాధితులకు నిత్యవసర సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. సర్వం కోల్పోయిన బాధితులకు సంస్థ తరపున 1 కిచెన్ సెట్,2 దుప్పట్లు పంపిణీ చేశారు కార్యక్రమంలో విఆర్ఒ రాజేష్, ఇండియన్ రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ చందక మన్మధరావు, పాల్గొన్నారు.

గురుదేవ్ ట్రస్ట్ చైర్మన్ ఇంట్లో చోరీ

90 తులాల బంగారం, ఐదు లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి - కొత్తవలస

మంగళపాలెం వద్దనున్న శ్రీగురుదేవ్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న 90 తులాల బంగారం, రూ.5లక్షలు నగదు అపహరణకు గురైనట్లు తెలిస్తోంది. ట్రస్ట్ ప్రాంగణం, గురుదేవ్ హాస్పిటల్‌తో నివాస ప్రధాన ద్వారం నిరంతరం సీసీ కెమెరాలు పహారా ఉండగానే ఇంటి వెనుక నుంచి తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడడం పలు అనుమానాలకు తావిస్తోంది. దొంగలు ఇంటిని సుదీర్ఘకాలం పాటు గమనించి చోరీకి పాల్పడడం, లేక తెలిసినవారే అఘాయత్నానికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. జగదీష్ బాబు పోలీస్‌లకు ఫిర్యాదు చేసిన మేరకు సిఐ షణ్ముఖరావు, విజయనగరం డిఎస్‌పి శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని గురువారం సందర్శించి పలు కీలకమైన ఆధారాలను గుర్తించారు. ఈ కేసులో పలు కోణాల నుంచి దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని సిఐ తెలిపారు.

సులువుగా డబ్బు సంపాదించాలనే..

- చీపురుపల్లి ఘటనను ఛేదించిన పోలీసులు
- 8 మంది దోపిడీ దొంగల అరెస్ట్
- సూత్రధారి చీపురుపల్లి వాసి
- పరారీలో మరో ఇద్దరు నేరస్తులు: డిఎస్‌పి

ప్రజాశక్తి -చీపురుపల్లి

పట్టణ పరిధిలోని మెయిన్ రోడ్‌లో ఈ నెల 24 వేకువజామున జరిగిన దోపిడీకి పాల్పడిన ముఠాను పట్టుకుని, 8మందిని అరెస్టు చేశామని డిఎస్‌పి ఎస్ రాఘవులు తెలిపారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో నేరస్తులను హాజరు పరిచి వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం...

దోపిడీ ఘటనలో మండలంలోని గచ్చలవలస గ్రామానికి చెందిన మన్నేల సూర్యారావు ప్రధాన పాత్రధారి. సూర్యారావు భూ వ్యాపారాలు, కాయిన్ బిజినెస్ చేస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడ్డాడు. సూర్యారావు తన స్నేహితుడైన నక్క అప్పలరాజు ద్వారా పదేళ్ల క్రితం చీపురుపల్లిలోని వారణాసి సురేష్ ఇంట్లో దాదాపు 300 కోట్ల నగదు, 300 కేజీల బంగారం ఉన్నాయని తెలుసుకున్నాడు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా ఎండబద్ర గ్రామానికి చెందిన ఆశీస్సులు జగన్‌ను రాయగడలోని ఓ కార్యక్రమంలో సూర్యారావు కలిశాడు. వారణాసి సురేష్ ఇంట్లో డబ్బులున్న విషయాన్ని జగన్‌కు చెప్పి దొంగతనం చేయడానికి ఎవరైనా వ్యక్తులను చూడాలని పురమాయించాడు. జగన్ వాళ్ల అత్తగారి గ్రామానికి చెందిన, విజయనగరంలో ఉంటున్న జ్యోతి అలియాస్ సావిత్రి వద్ద సమావేశమై, దొంగతనం చేయడానికి నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో ఆ ఇంటి ఫోటోలు, వీడియోలను సూర్యారావు.. జ్యోతికి వాట్సాప్ ద్వారా పంపించాడు. అప్పటికే జ్యోతికి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పరిచయం ఉన్న దేవరపల్లి మండలం సంగాయగూడేనికి చెందిన వెంకటేశ్వరరావుకు ఈ విషయాన్ని చేరవేసింది. రైస్ పుల్లింగ్, రాగి కాయిన్స్ వంటి విషయాల్లో పరిచయం ఉన్న కృష్ణా జిల్లా బంటుపల్లి మండలం పెద్ద తుమ్మిడి గ్రామానికి చెందిన నాగరాజును వెంకటేశ్వరరావు సంప్రదించాడు. నాగరాజు ఇదే విషయమై బాపట్ల జిల్లాకు చెందిన వజ్రాల బాబుకు చెప్పి దొంగతనం చేయాలని నిర్ధారించుకున్నారు. వజ్రాల బాబుకు గతంలో ఏలూరులో దొంగతనం చేసినప్పుడు పరిచయమైన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం ఆకివీడు గ్రామానికి చెందిన వంగర శ్రీనుకు సమాచారమిచ్చి, దొంగతనానికి ఒప్పించాడు. శ్రీను తన వెంట కిశోర్ అనే వ్యక్తిని తీసుకువస్తానని చెప్పగా వజ్రాల బాబు అంగీకరించాడు. దెందులూరు మండలం మండూరు గ్రామానికి చెందిన శ్యామ్‌కుమార్‌ని తీసుకుని శ్రీను రాజమండ్రి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ నుండి శ్రీను విజయవాడకు చెందిన కిశోర్ కలుసుకొని కైకలూరు వెంకటేశ్వరరావుకు ఫోన్ చేశాడు. వెంకటేశ్వరరావు, మనోజ్ కలిసి వైట్ కలర్ బెంజ్ కార్లో వచ్చి ముఠా సభ్యులను తీసుకొని విజయనగరం చేరుకున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి రాఘవులు

ముఠా సభ్యులైన వెంకటేష్, జ్యోతికి ఫోన్ చేసి ఓ ప్రయివేటు రెస్టారెంట్లో దొంగతనం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఇంటిలో ఇద్దరు వృద్ధులు ఉంటారని సూర్యారావు మిగతా వారికి సమాచారమిచ్చాడు. అదే రోజు సాయంత్రం జ్యోతి, వజ్రాల బాబు, జగన్, కిషోర్, డ్రైవర్ మనోజ్ ముందుగా చీపురుపల్లిలో దోపిడీ చేయాల్సిన ఇంటి చుట్టూ రెక్కీ నిర్వహించారు. అనంతరం మంగళవారం రాత్రి ఒంటిగంట సమయంలో కారులో అక్కడికి చేరుకున్నారు. అక్కడ నుండి కారులో వెంకటేశ్వర్లు డ్రైవర్ మనోజ్ వెళ్లిపోయారు. వజ్రాల బాబు, శ్యామ్, కిషోర్, శ్రీను ఇంటి వెనుక భాగం నుండి గోడ పైకెక్కి మొదటి ఫ్లోర్‌లో డోర్‌ను ధ్వంసం చేశారు. అక్కడ నగదు, బంగారం దొరక్కపోవడంతో గ్రౌండ్ ఫ్లోర్‌కి చేరుకున్నారు. ఆ సమయంలో అలికిడి కావడంతో ఇంట్లో నిద్రిస్తున్న ఇద్దరు మహిళలు కేకలు వేశారు. దీంతో దుండగులు వారు వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్లతో వారిపై విచక్షణారహితంగా దాడికి తెగపడ్డాఉ. దీంతో వారణాసి కస్తూరి, వైశ్యరాజు చిట్టితల్లి అనే వృద్ధులు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం బీరువాలు, కబోర్డులను పరిశీలించినా నగలు, డబ్బు కనిపించలేదు. దీంతో మహిళల ఒంటిపై ఉన్న నగలను దొంగిలించి, మరోమారు వృద్ధులపై దాడి చేశారు. అక్కడే ఉన్న కారాన్ని రక్తపు మడుగులపై చల్లి పరారయ్యారు. అనంతరం ఈనెల 28న విజయనగరంలోని గతంలో కలుసుకున్న ప్రాంతంలోనే మళ్లీ కలిసి, దోపిడీ సొత్తును పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఎస్‌పి ఆధ్వర్యంలో బృందాలుగా వీడి చీపురుపల్లి సర్కిల్ పోలీసులు ఆధునిక సాంకేతికత సహకారంతో దోపిడీకి పాల్పడిన ముఠా సభ్యులు వివరాలను తెలుసుకుని, వెంటనే విజయనగరంలో ఆ బృందాన్ని పట్టుకున్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-బొబ్బిలి

కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపనచేస్తున్న సివిల్ జడ్జి

కోర్టు భవన నిర్మాణ పనులకు జూనియర్ సివిల్ జడ్జి జె.హేమ స్రవంతి గురువారం శంకుస్థాపన చేశారు. కోర్టు భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టరును హేమస్రవంతి ఆదేశించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు ఎం.ఆనందకుమార్, మూర్తి, మాజీ అధ్యక్షులు మోహన్ మురళీ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మూడు బ్యాంకు కొలువులు సాధించిన గాయత్రి

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక ఇందిరమ్మ కాలనీకు చెందిన బొత్స గాయత్రీ ఒకేసారి మూడు బ్యాంకులలో ఉద్యోగాలు సాధించి ప్రతిభ కనబరిచింది. కాలనీకి చెందిన బొత్స హరికృష్ణ, శ్రీదేవి కుమార్తె గాయత్రీ డిగ్రీ పూర్తి చేసి విజయవాడలో కోచింగ్ తీసుకుని బ్యాంక్ ఉద్యోగాలకు పరీక్షలు రాసింది. ఇటీవల విడుదలైన బ్యాంక్ ఫలితాలలో ఐడిబిఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్, కెనరా బ్యాంక్ క్లర్క్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పిఒగా ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పిఒగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించినట్లు గాయత్రీ చెప్పింది. ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని గాయత్రీ తల్లిదండ్రుల హర్షం వ్యక్తం చేశారు.

కడప దర్గాను దర్శించుకున్న బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

కడప దర్గాను ఎమ్మెల్యే బేబినాయన దర్శించుకున్నారు. మహానాడుకు కడప వెళ్లిన బేబినాయన దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిములు ఆరాధ్యంగా భావించే దర్గాను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని బేబినాయన అన్నారు.

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని వెలగవలస, లోచర్ల, వి.చిన్నయ్యపేట సచివాలయాలను తహశీల్దార్ హేమంత్ కుమార్, ఆర్ఐ కృష్ణమూర్తి నాయుడు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవలో భాగంగా ఆధార్ మిస్సింగ్ అయిన రైతులు ఆధార్ లింక్ చేసుకోవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన పథకాలు ఏ ఒక్కరూ మిస్ కాకూడదని ఈ సచివాలయ పరిధిలో ఉన్న రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట పలువురు విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

31న పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

జూన్ నెల పింఛన్లను ఈ నెల 31న పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ తెలిపారు. జూన్ ఒకటో తేది ఆదివారం కావడంతో ముందురోజు శనివారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

వెల్‌నెస్ సెంటర్ సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి వెల్‌నెస్ సెంటర్‌ను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని సూచించారు. తద్వారా గ్రామస్తుల వద్ద మంచిపేరు సంపాదించాలని కోరారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక శ్రీసాయి డిగ్రీ కళాశాలలో గురువారం వత్తి నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాకు 598 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. అందులో 316 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రశాంత్ కుమార్ చెప్పారు. 29 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొన్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం.అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంగ్లీష్ మిస్సింగ్ పదాలపై అవగాహన

ప్రజాశక్తి - తెర్లాం

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం ఆ శాఖాధికారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఇంగ్లీష్ మిస్సింగ్ పదాలపై పిల్లలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులను రెండు గ్రూపులుగా విభజించి ఇంగ్లీష్ పదాలను బ్లాక్ బోర్డ్ మీద రాస్తూ వాటి అర్థాలను వివరిస్తూ పదాలకు అర్థం చెబుతూ పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, జిల్లా పరిషత్ స్కూల్ ఉపాధ్యాయులు విస్సు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ కె.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిసి, బైపిసి, హెచ్‌ఇసి గ్రూపుల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ప్రవేశాలు ఉంటాయని చెప్పారు. గత రెండేళ్లలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు.

గోతులు పూడ్చిన పోలీసులు

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దాడితల్లి ఆలయం జంక్షన్ వరకు ఉన్న బైపాస్ రోడ్డుపై గోతులు ఏర్పడడంతో ట్రాఫిక్ పోలీసులు పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో రోడ్డుపై గోతులలో భవన నిర్మాణ వ్యర్థాలు వేసి గురువారం గోతులను పూడ్చారు. ప్రమాదాలు జరగకుండా చూసేందుకు గోతులను కప్పినట్లు ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ చెప్పారు. పోలీసులు తీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

నీరు నిల్వ లేకుండా చూడండి

ప్రజాశక్తి - బొబ్బిలి

రోడ్లు, కాలువలలో నీరు నిల్వ లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని టిటిడి, టిబిఆర్ రోడ్డు ప్రాంతాలలో గురువారం పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. వర్షాలు విస్తారంగా కురవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, రోడ్లు, కాలువలలో నీరు నిల్వ లేకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీను ఆదేశించారు. రోడ్లు, కాలువలు శుభ్రం చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఆదేశించారు. ఆమెతో పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ కేశవరావు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ జి.ఈరన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు 18 నుంచి 30 ఏళ్ల గల పదో తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు అర్హులని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు కళాశాలకు వచ్చి జూన్ నాలుగో తేదీలోపు రిజిస్టర్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 79956 91295 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గొర్లిపేటలో డబ్బులు పనంగా పెట్టి పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని నగదు జప్తు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. గురువారం గొర్లిపేటలో పేకాడుతున్న వారిపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.15వేలు నగదు జప్తు చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎంఎస్‌పిలతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలపై దృష్టి సారించి గొడవలు జరగకుండా చూడాలని వెంటనే పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

కౌలురైతులు గుర్తింపు కార్డులు పొందాలి

ప్రజాశక్తి- గంట్యాడ



గంట్యాడ : రామవరంలో కౌలు రైతులకు గుర్తింపుకార్డు అందజేస్తున్న జెడి విటి రామారావు; గజపతినగరంలో నవ ధాన్యాల కిట్లు అందజేస్తున్న అధికారులు

ప్రతి కౌలురైతూ కౌలు కార్డులను పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు అన్నారు. గురువారం రామవరంలో జరిగిన కౌలు రైతుల గ్రామసభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు కార్డు ఉన్న ప్రతి రైతుకూ క్రాప్ రుణం, పంట ఇన్సూరెన్స్, పంట నష్ట పరిహారం, విత్తనాలు, పలు రాయితీలు వర్తిస్తాయన్నారు. మండల పరిధిలోని 975 కౌలు కార్డులను ఇస్తామన్నారు. జూన్ 7వ తేదీ లోపు కార్డులను పంపిణీ చేయాలని ఆదేశించారు. కౌలు కార్డులు ఉన్న రైతులకు అన్నదాత సుఖీభవ వర్తిస్తుందన్నారు. ప్రతి కౌలు రైతును ఎపిఎఫ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కౌలు రైతులు సమావేశానికి హాజరై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.శ్యామ్ కుమార్, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

త్వరితగతిన కౌలురైతులు గుర్తింపు

బొబ్బిలిరూరల్ : కౌలురైతులను త్వరితగతిన గుర్తించాలని వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్ వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో రైతులకు సిసిఆర్ కార్డులు, అన్నదాత సుఖీభవ పథకంపై అవగాహన కల్పించారు. కౌలు రైతుల కార్డులను త్వరితగతిన గుర్తించి వచ్చేనెల 15వ తేదీలోగా జారీ చేయాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి పొందుటకు రైతు విధిగా భూములను, బ్యాంకు ఖాతాను ఆధార్ కార్డు అనుసంధానం చేయించుకోవాలని, కుటుంబ సర్వేలో ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో విఎఎ సుస్మిత, విఆర్ఒ సత్యనారాయణ , కృష్ణాపురం సర్పంచ్ సింహాచలం పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన

గజపతినగరం రూరల్ :కౌలు రైతులకు సిసిఆర్ కార్డులు ఎలా పొందాలనే అంశంపై గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. గురువారం కాలంరాజుపేట, శ్రీరంగరాజపురం గ్రామాల్లో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి గోవిందమ్మ, ఎఒ ధనలక్ష్మి మాట్లాడుతూ.. భూమి కౌలుకు తీసుకొని పంట పండించే ప్రతీ రైతు కౌలు కార్డులు తీసుకోవాలని, తద్వారా పంట మీద వచ్చే ప్రతీ హక్కును పొందవచ్చునని తెలిపారు. సిసిఆర్ కార్డు కేవలం 11 నెలలు మాత్రమే పనిచేస్తుందని తెలిపారు. అనంతరం రైతులకు నవధాన్యాల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి మాధవి, గ్రామ అగ్రికల్చర్ సహాయకులు మస్తాన్, సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, ఎంపిటిసి సభ్యుడు గేదెల జగదీష్, గ్రామ పెద్దలు లెంక స్వామి, రైతులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు చేసుకోవాలి

కొత్తవలస: కౌలు రైతులు తమ పండించిన పంటలకు ఈ పంట నమోదు చేసుకోవాలని ఎఒ మాధురి శరణ్య తెలిపారు. బలిఘట్టం రైతు సేవా కేంద్రంలో కౌలు రైతుల గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 28వ తేదీ నుంచి జూన్ రెండవ తేదీ వరకు మండలంలో గ్రామ సచివాలయాల్లో పంట సాగు దారు హక్కు పత్రం పొందాలని తెలిపారు. కార్యక్రమంలో విహెచ్ఎ. ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని సీతారామునిపేటలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో కౌలు రైతులకు అవగాహన సదస్సు ర్వహించారు. ఈ సందర్భంగా చీపురుపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది 340 మంది కౌలు రైతులను గుర్తించడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు కౌలు రైతులు కౌలు కార్డులు కోసం వారి ఫోటో, ఆధార్, యజమాని 1బి పత్రం తీసుకొని గ్రామ వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ అధికారిని సంప్రదించాల ని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయసహాయకులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

కౌలు ధ్రువీకరణ పత్రాన్ని పొందాలి

భోగాపురం : ప్రతి కౌలు రైతు కౌలు ధ్రువీకరణ పత్రాన్ని పొందాలని తహసీల్దార్ ఎం సురేష్ అన్నారు. ముంజేరు, చాకివలస పంచాయతీల్లో అవగాహన సదస్సులను నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 470 మందికి కౌలు రైతు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. వ్యవసాయ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ కౌలు రైతులు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని అన్నారు. వీటి ద్వారా అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, కౌలు రైతులు పాల్గొన్నారు

వాహనదారులకు తిప్పలు

రాకపోకల బంద్
పట్టించుకోని ఆర్‌అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి- డెంకాడ

ముంగినాపల్లి వద్ద అధ్వానంగా ఉన్న కల్వర్టు

మండలంలోని విజయనగరం కుమిలి వెళ్లే రహదారిలో ఆర్ ముంగినాపల్లి వద్ద ఆర్ అండ్ బి రోడ్డులో కల్వర్టు రోజు రోజుకీ కుంగిపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురుకు గాయాలయ్యాయి. దీంతో ఇటీవల ప్రజాశక్తి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎస్ఐ సన్యాసినాయుడు ఆ రోడ్డు గుండా ఏ వాహనాన్ని వెళ్లనీయకుండా అక్కడ స్టాప్ బోర్డులు పెట్టి అడ్డంగా మట్టి కూడా వేయించారు. తాత్కాలికంగా పక్కనే ఉన్న రెడ్డికి పేట మీద నుంచి వాహనాలను తరలించారు. కానీ మండలంలో గత మూడు రోజుల నుంచి వర్షాలు పడడంతో ఆ తాత్కాలిక రోడ్డుపై నుంచి వెళ్లడానికి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇది అసలే మట్టి రోడ్డు కావడంతో వర్షం పడడంతో చిత్తడి చిత్తడిగా తయారైంది. దీంతో వాహనాలు బురదతో పక్కకు జారిపోతున్నాయి. ఆ పక్కనే డెంకాడకు వెళ్లే పెద్ద సాగునీటి కాలువ ఉండడంతో వాహనాలు అదుపు తప్పితే అందులోనికి వెళ్లిపోయే ప్రమాదం ఉందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా విజయనగరం నుంచి శ్రీకాకుళం మీదగా ఒరిస్సా వెళ్లడానికి వాహనదారులకు ఈ రహదారి దగ్గరగా ఉండడంతో విజయనగరం శ్రీకాకుళం రెండు వైపుల నుంచి మోటార్ సైకిల్‌తో పాటు ఇతర భారీ వాహనాలు కూడా ఈ రోడ్ లోనే ప్రయాణిస్తుంటాయి. ఇప్పుడు వర్షానికి తాత్కాలికంగా వెళ్లే మట్టి రోడ్డు పాడవడంతో భారీ వాహనదారులు వచ్చి తిప్పల పడవలసి వస్తుంది. ఈ మూడు రోజులు వర్షాల వల్ల రాకపోకలకు ఈ రోడ్డు బంద్ అయింది. తెలియక శ్రీకాకుళం నుంచి వచ్చిన వాహనదారులు వెనక్కి వెళ్ళలేక ముందుకు రాలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్‌అండ్‌బి అధికారులకు చీమకుట్టినట్టుగా లేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి కల్వర్టును త్వరితగతిన పూర్తిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

'లెండి'కి టైర్-1 ఎన్‌బిఎ అక్రిడిటేషన్

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో గల మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్ విభాగాలలోని ఇంజినీరింగ్ విద్యలో చూపించిన అత్యుత్తమ ప్రతిభకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఎ) నుంచి ప్రతిష్టాత్మక టైర్-1 అక్రిడిటేషన్‌ను పొందినట్లు సంస్థ ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గుర్తింపు ద్వారా లెండి ఒక ముఖ్యమైన మైలురాయిని దాటి ఈ ప్రాంతంలోని టైర్-1 ఎన్‌బిఎ సాధించిన అతి కొద్ది ఇంజనీరింగ్ విద్యా సంస్థలలో ఒకటిగా ఎదిగి, జాతీయంగా, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిందన్నారు. ఈ ప్రతిష్టాత్మక అక్రిడిటేషన్ లెండి యొక్క విద్యా నైపుణ్యం, పరిశ్రమ-ఆధారిత పాఠ్యాంశాలు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన అధ్యాపకులు, బలమైన ప్లేస్‌మెంట్ రికార్డు పట్ల నిబద్ధతకు నిదర్శనమన్నారు. సంస్థ చైర్మన్ పి.మధుసూదనరావు మాట్లాడుతూ ఈ గుర్తింపుతో మరింత బాధ్యతను పెంచిందన్నారు.

బిటి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - గుర్ల రూరల్

మండలం పల్లిగండ్రేడు పంచాయతీ పరిధిలోని రాజులపేటకు రూ.55 లక్షల ఉపాధి హామీ నిధులతో మంజూరైన బిటి రోడ్డు పనులను గురువారం కూటమి నాయకులు, జిల్లా బిజెపి అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ, జంపన సూర్యనారాయణ రాజు, మజ్జి రామారావు, సర్పంచ్ పెనుమల శంకరయ్య, మజ్జి ఆదినారాయణ ప్రారంభించారు. దశాబ్దాల తరబడి రోడ్డు కోసం ప్రయత్నాలు చేసినప్పటికి, నేటికి బిటి రోడ్డు ఏర్పాటుకు కృషి చేసి, రోడ్డు మంజూరు చేసిన ఎమ్మెల్యే కళా వెంకటరావుకు, రాష్ట్ర బిసిసెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెన్నె సన్యాసి నాయుడుకు, జిల్లా టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి తిరుమల రాజు కిరణ్ కుమార్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ వర్మ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాలాభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి

ప్రజాశక్తి - తెర్లాం

పిల్లలను ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బడిలో చేర్పించాలని సర్పంచ్ మధు కోరారు. మండలంలోని విజయరాంపురం గ్రామంలో జ్ఞాన సరస్వతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఎంపియుపి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరుతూ గురువారం ప్రచారం చేశారు. ఆ పరిధిలో ఉన్న బూరిపేట, అప్పలమ్మపేట, గొలుగువలస గ్రామాల పిల్లలను వారి తల్లిదండ్రులను గ్రామ పెద్దలను ప్రధానోపాధ్యాయులు బి.నారాయణరావు సమక్షంలో ఇంటింటికీ వెళ్లి కలిశారు. 3 గ్రామాల నుంచి దాదాపు 18 అడ్మిషన్స్ వచ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బి.మధుసూదన్‌రావు మాట్లాడుతూ మండలంలో మారుమూల గ్రామమైన బూరుపేట లో ప్రభుత్వ పాఠశాల ఉండాలని అందుకే ఇక్కడ పిల్లలందరినీ ప్రభుత్వ బడిలో చేర్పించి తమ పాఠశాలను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డిపోల్లోనే రేషన్ పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి - రామభద్రపురం

జూన్ 1 నుంచి డీలర్ల ఆధ్వర్యంలో డిపోల్లోనే రేషన్ పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు. తన కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎండియు వ్యవస్థ రద్దుచేసి పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీకి మార్గదర్శకాలు విడుదల అయ్యాయని తెలిపారు. ఉదయం 8నుంచి 12గంటల వరకు సాయంత్రం 4నుంచి 8గంటల వరకు 1 నుంచి 15వ తేదీ వరకు డిపోలో సేవలు అందించాలని తెలిపారు. ఈవిషయాన్ని ప్రజలందరికీ తెలియజేయా లన్నారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, విఆర్‌ఒలు, డీలర్లు పాల్గొన్నారు.

పలుచోట్ల యోగా శిక్షణ

ప్రజాశక్తి-మెంటాడ

మెంటాడలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పలు శాఖల సిబ్బంది

మండల కేంద్రంలో గురువారం యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయం నుంచి గద్దెంచెట్టు వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం నిర్వహించారు. యోగా గురించి డాక్టర్ పి.శ్రీనివారావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ భానుమూర్తి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్మం వెంకటరావు, ఎంఇఒ శర్మ, ఎంపిడిఒ చినప్పయ్య, యుటిఫ్ మండల కార్యదర్శి సత్యనారాయణ, గృహ నిర్మాణ సంస్థ ఎఇ వై.మహేశ్వరరావు, టి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. దత్తిరాజేరు మండలంలో యోగాపై భారీ అవగాహన ర్యాలీ జరిగింది. ఎంపిడిఒ, తహశీల్దార్, పలుశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా స్థానిక మున్సిపల్ హైస్కూల్, కస్పాస్కూల్‌లో విజయనగరం డివిజన్ లోని మండలాల యోగ రిసోర్స్ పర్సన్ లకు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.కృష్ణంరాజు, డైట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు జి.లక్ష్మణరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

జెఎన్‌టియులో ఉత్సాహంగా యోగేంద్ర కార్యక్రమం

జెఎన్‌టియు గురజాడలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతీ రోజు యోగా చేస్తు తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, యోగా ద్వారా మానసిక ఉల్లాసానికి అవకాశం ఉంటుందని అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్. జి. జయసుమ, ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. ఆర్.రాజేశ్వరరావు, విశ్వవిద్యాలయ డైరెక్టర్లు, డాక్టర్ ఆర్. గురునాథ, పరీక్షల నియంత్రణాధికారి, డాక్టర్ జి.అప్పలనాయుడు, విశ్వవిద్యాలయ క్రీడల సమన్వయకర్త, డాక్టర్ ఎ.వి.పాపారావుపాల్గొన్నారు.

యోగా వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు

యోగా వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద యోగాసనాలు వేసే కార్యక్రమం జరిగింది. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇందుమతి యోగాసనాలు చేసే విధానాలను వివరించారు. అనంతరం ర్యాలీని చేపట్టి యోగాంధ్ర విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఆర్ఒ సింహాచలం, నగరపాలక సంస్థ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వేపాడ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మూడో రోజు యోగా శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేపాడలో యోగా శిక్షణ పొందుతున్న మహిళలు

కొండపేట పాఠశాల మూత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మూతపడనున్న పాఠశాల

నగర పంచాయతీ పరిధి కొండపేటలో ఎన్‌జెఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల మూసివేతకు గురవుతుంది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న సాకుతో ప్రభుత్వం ఈ పాఠశాలను మూసి వేస్తున్నట్లు తెలిస్తోంది. గతంలో జ్యూట్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఎయిడెడ్ పాఠశాలగా నిర్వహించి విద్యార్థులకు ప్రాథమిక విద్య అందించేవారు. అయితే ఇటీవల ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని కొండపేట ప్రాథమిక పాఠశాల మూసి వేసి నెల్లిమర్ల పాఠశాలలో కలిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కాగా ఈ పాఠశాల మూసివేత జరిగితే అక్కడ పిల్లలు చంపావతి నదిని దాటుకొని వెళ్లడమే కాకుండా రైల్వే పట్టాలు దాటి 3 కిలోమీటర్లు ప్రాథమిక విద్య కోసం వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు పేద విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమై బాల కార్మికులుగా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దశాబ్దాల కాలం నుంచి ఉన్న ఎన్‌జెఎం ప్రాథమిక పాఠశాలను మూసేయకుండా కొనసాగించాలని పాఠశాల ఎస్ఎంసి కమిటి చైర్మన్ ఎం. మోనిషా, ఉపాధ్యక్షుడు టి. సూరిబాబు కోరుతున్నారు. దీనిలో భాగంగా వారు ఇప్పటికే జిల్లా విద్యాశాఖాధికారి, అమరావతిలోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, విశాఖపట్నం రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కి వినతి పత్రాలు అందజేశారు.

పంచాయతీ కార్యదర్శికి మెమో

విచారించి నివేదిక ఇవ్వాలని
ఇఒపిఆర్‌డికి ఆదేశం
ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - భోగాపురం

గ్రామ సచివాలయాన్ని ప్రారంభించకుండా సిబ్బంది అందులో విధులు నిర్వహిస్తున్న వ్యవహారంలో మండలంలోని చెరుకుపల్లి పంచాయతీ కార్యదర్శికి గురువారం మెమో జారీ చేశారు. చెరుకుపల్లి సచివాలయ భవనం నిర్మాణం పూర్తవడంతో ప్రజా ప్రతినిధులు ప్రారంభించకుండానే సచివాలయ సిబ్బంది అందులో విధులు నిర్వహిస్తున్నారు. దీనిపై 'ప్రారంభించకుండానే విధులు' అనే కథనం ప్రజాశక్తిలో గురువారం వెలువడింది. దీనికి స్పందించిన ఎంపిడిఒ కిశోర్‌కుమార్ ఈ వ్యవహారంలో పూర్తిగా విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఇఒపిఆర్‌డి గాయత్రిని విచారణ అధికారిగా నియమించారు. దీంతో కొత్త సచివాలయ భవనాన్ని మూసివేసి యథావిధిగా పాత సచివాలయ కార్యాలయంలో గురువారం నుంచి విధులు నిర్వహిస్తున్నారు. పై అధికారులకు చెప్పకుండా కొత్త సచివాలయంలో విధులు నిర్వహణపై పంచాయతీ కార్యదర్శి అరుణకు మెమో జారీ చేశారు. ఈ వ్యవహారంపై విచారణ అధికారి గాయత్రి శుక్రవారం విచారణ చేయనున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కనకచారి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

వాతావరణ పరిసితులను బట్టి రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న కారణంగా సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కనకాచారి సూచించారు. గురువారం తమ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కనకచారి మాట్లాడుతూ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. వేడి ఆహారం తీసుకోవాలని, నిల్వ ఉంచిన ఆహారం తీసుకోవద్దని సూచించారు. సంఘం గౌరవ అధ్యక్షులు ఐ.గోపాలరావు మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన మురికివాడ ప్రాంతంలో ఉండే గ్రామీణ వైద్యులు ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా చూడాలని కోరారు. వ్యాధులు ప్రబలిన ప్రజలకు గ్రామీణ ప్రాంతంలో ప్రథమ చికిత్స మాత్రమే చేసి ప్రభుత్వ ఆస్పత్రులకు పంపాలని తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్తుశాఖ ఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ల మరమ్మతులు, ఫీడర్ల పరిధిలో చెట్టు కొమ్మలు తొలగించే పనుల వల్ల విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ధర్మపురి ఫీడర్ పరిధిలో నోబుల్ నగర్, బియాలపేట, కొత్త ధర్మపురి,కమలానగర్, ధర్మపురి గ్రామం, జిఎస్‌ఆర్ లే అవుట్ , ఎస్‌విఎన్ నగం, బెటాలియన్ ఫీడర్ మీద ఉన్న వసంత విహార్, పద్మావతినగర్, గాయత్రినగర్‌కు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. కలెక్టరేట్ సబ్ స్టేషన్ పరిధిలో సంజీవయ్య కాలనీ, కలెక్టరేట్ ఎదురుగా ఉండే ప్రాంతం, కనపాక యాతపేట, భవాని నగర్, కేఎల్ పురం, ఆర్టీవో ఆఫీస్, సాయి లలిత నగర్, సాయి కీర్తన నగర్, కోయి నగర్, ద్వారపూడి రోడ్డు ప్రాంతంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

నెలిమర్ల : మండలంలోని సతివాడ, రామతీర్థం, విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మధుపాడ, పినతరిమి,పెద తరిమి, బొప్పడాం, వల్లూరు, బొడ్డపేట, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం, గ్రామాలకు, శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

మండల కేంద్రంలో మెయిన్ పంప్ హౌస్, సినిమా హాలు, మారుతీ హాస్పిటల్, మాస్టర్ పంప్ హౌస్, హౌసింగ్ కాలనీ, నగర పంచాయతీ పంప్ హౌస్, ఎయిర్ టెల్, ఇండస్ టవర్స్, రైల్వే పంప్ హౌస్, కొత్తపేట గ్రామీణ నీటి సరఫరా పథకం, గ్యాస్ గోడౌన్, టొంపలపేట, బృందావనం వ్యాలీ, కుదిపి, నీలంరాజుపేట, జగ్గరాజుపేట, తారకరామ ప్రాజెక్టు ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

తైక్వాండో పోటీలకు బొబ్బిలి విద్యార్థులు

ప్రజాశక్తి-బొబ్బిలి

జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న అభ్యుదయ విద్యాసంస్థల ప్రతినిధి చింత శారద, పట్టణ సిఐ సతీష్‌కుమార్

కటక్‌లో శుక్ర, శని, ఆదివారాల్లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి విద్యార్థులు బయల్దేరారు. ఈ పోటీలకు టి.లిఖితరావు, టి.తస్వికరావు, ఎస్.అహ్మద్, ఎం.శ్రీకర్ యాదవ్, ఆర్.శ్రుతికీర్తన, ఆర్.సృజన, సిహెచ్.చాణక్య, సిహెచ్. నాగార్జున, కె.ప్రిన్స్‌బాబు, కె.ప్రణవ్, ఆర్.వెంకట క్రితిన్ అమాఖ్య, జి.కిన్నిరేష్, ఎస్.అబ్దుల్, వి.భరత్ కుమార్, పి.జ్ఞాన దీపక్, ఎ.సూర్యశశాంక్, కె.శరవన్ చరణ్ ఎంపికైనట్లు కోచ్ సుధాకర్ యాదవ్ తెలిపారు. వీరిని అభ్యుదయ విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధి చింత శారద, పట్టణ సిఐ సతీష్ కుమార్ అభినందించారు.